క్లుప్తంగా

నేడు రూరల్ పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభం



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు ఆహ్వానం పలుకుతున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ మురళీధర్‌రావు, సీఐలు

సాలూరు: ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన రూరల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర శనివారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ డీఎస్పీ మురళీధర్‌రావు, రూరల్, పట్టణ సీఐలు ధనుంజయనాయుడు, శ్రీనివాసరావు, ఎస్సై ప్రయోగమూర్తి తదితరులు రాజన్నదొరను ఆయన స్వగృహంలో శుక్రవారం కలిసి ఆహ్వానం పలికారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీఐజీ హరికృష్ణ, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొంటారని రూరల్ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ద్వాదశి పూజలు



ఆలయంలో జ్యోతులు వెలిగిస్తున్న భక్తులు

సీతానగరం: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని సువర్ణముఖినది తీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయంలో మహిళలు శుక్రవారం సాయంత్రం ద్వాదశి పూజ, లక్షదీపారాధన చేశారు. మహిళల దీపారాధనతో విశాలంగా ఉన్న ఆలయ ప్రాంగణమంతా వెలుగులు విరజిమ్మింది. దూర ప్రాంతాలనుంచి మహిళా భక్తులు ద్వాదశి పూజలకు ఆలయానికి రావడం ఆనవాయితీ.

దరఖాస్తుల పరిశీలన



లచ్చారాయపురంలో దరఖాస్తుదారుల వివరాలు పరిశీలిస్తున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: వైఎస్సార్ కల్యాణమస్తు పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను మండలంలోని లచ్చారాయపురం, మజ్జిరాముడుపేట గ్రామాలకు ఏపీఎం పి.గోవిందరావు శుక్రవారం వెళ్లి, పరిశీలించారు. దరఖాస్తుదారులు ఎంతమేర నిజమైన అర్హులన్న విషయం తెలుసుకునేందుకే ఇంటింటికీ వెళ్లి, దరఖాస్తులు, వారి వివరాలు సరిచూస్తున్నట్లు ఏపీఎం తెలిపారు.

26, 27 తేదీల్లో చలో విజయవాడ



మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలతో పలువురు వర్కర్లు రోడ్డున పడతారని, దీనికి నిరసనగా ఈ నెల 26, 27 తేదీల్లో విజయవాడలో నిర్వహించే ధర్నాకు తరలి రావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లు ఇవ్వలేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, జిల్లా నాయకులు పొట్నూరు శంకరరావు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘ నాయకురాలు రౌతు సత్యవతి, ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు లంక శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చోడిసాగుపై అవగాహన

రాజాం సిటీ: చోడిసాగుపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని విజయనగరం డీఏటీటీసీ సెంటర్ సైంటిస్ట్ కో–ఆర్డినేటర్ కె.లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొద్దాం గ్రామంలో రైతులకు చోడిసాగుపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో పండించే ఈ పంటను రైతులు పండించి, అధిక దిగుబడి, లాభాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ కె.చంద్రరావు, ఏవో ఎం.రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, అంబఖండి, బూరాడ గ్రామాల్లోని రైతులకు రబీ సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏవో మురళీకృష్ణ సూచనలు, సలహాలు చేశారు. రబీ సాగుకు సంబంధించి, మడ్డువలస ప్రాజెక్ట్ నుంచి నీటిని అందిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం



పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ జెండాకు వందనం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

- మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురంటౌన్:

ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు కాబట్టే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి కోరారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని గాంధీనగర్ సచివాలయం పరిధిలో నిర్వహించిన ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా పార్టీ జెండాను, సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్న సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక నెరవేర్చారని చెప్పారు. అన్ని వర్గాలకు ఆమోద యోగ్యమైన మేనిఫెస్టో తయారు చేసి నవరత్నాల్లాంటి పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో పాలనను ప్రజల ముంగిటకే తెచ్చారన్నారు. ప్రజలకు పారదర్శకపాలన అందిస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి ఎన్నుకోవాల్సిన అవసరముందని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే బలిజిపేట మండలంలోని అజ్జాడ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ అలజంగి రవికుమార్, మక్కువ మండలంలోని సరాయివలస గ్రామంలో మావుడి రంగునాయుడు పర్యటించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మోహిని, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సీతానగరం మండలంలోని బగ్గందొరవలస సచివాలయం పరిధిలో ఉన్న రెండు గ్రామాల్లో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు బల్లకృష్ణాపురం, బగ్గందొరవలస సర్పంచ్‌లు రామకృష్ణ, నారాయణరావు, ఎంపీటీసీ గౌరీశ్వరిలు వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి, ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ, ఐసీడీఎస్ ఎస్‌ఓ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన జెడ్పీటీసీ రవికుమార్



సాలూరు: బంగారమ్మ కాలనీలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, కన్వీనర్ గిరిరఘు తదితరులు



సీతానగరం: గ్రామంలో ర్యాలీచేస్తున్న జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు



మక్కువ: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలపై అవగాహన కల్పిస్తున్న మావుడి రంగునాయుడు

చాతుర్మాస దీక్ష ఉద్వాసన

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలో గల కృష్ణమందిరం పరిధిలో చాతుర్మాస దీక్ష తీసుకున్న భక్తులతో శుక్రవారం దీక్షా ఉద్వాసన ఘనంగా జరిగింది. ఈ మేరకు ఆలయ ప్రధానఅర్చకుడు, నిర్వాహకుడు రొంగలి శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం దీక్ష తీసుకున్న కామందొరవలస, బూర్జ, కృష్ణారాయపురం గ్రామాలకు చెందిన కృష్ణ భక్తులు ప్రతిరోజూ వేకువజామున నగర సంకీర్తన, పూజా కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. నిత్యం గీతాపారాయణం, ఉపన్యాసాలు, ప్రార్థనలు జరిగాయన్నారు. మందిర అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో దీక్షలు తీసుకున్న భక్తులంతా సువర్ణముఖి నదిలో శుక్రవారం స్నానాలు చేసి ఉద్వాసన చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 1000 మంది భక్తులకు అన్న సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి.సింహాచలం, ఎం.సింహాచలం, టి.తిరుపతిరావు పాల్గొన్నారు.



గీతాపారాయణం చేస్తున్న అర్చకుడు శ్రీనివాసరావు

గ్రామసభల్లో ఉపాధి పనులు గుర్తించాలి

రాజాం: అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి, ఉపాధి హామీ పనులు గుర్తించి, పంచాయతీ పాలకమండలి ఆమోదం పొందేలా చూడాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, గ్రామాల్లో చేయనున్న ఉపాధి పనులకు సంబంధించి, ఇప్పటికే కొన్ని పనులు గుర్తించడం జరిగిందన్నారు. రైతులు, వేతనదారులతో కూడా సమావేశాలు నిర్వహించి, అందరికీ ఉపయోగపడే చోట్ల పనులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శంకరరావు

వృత్యంతర శిక్షణ అంశాలను అమలు చేయాలి

బాడంగి: ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణలో నేర్చుకొన్న మెలకువలు, కొత్త విషయాలను పాఠశాలల్లో బోధన సమయంలో అమలు చేయాలని కోర్స్ డైరెక్టర్, హైస్కూల్ హెచ్‌ఎం డి.సత్యనారాయణ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో రెండు రోజుల పాటు జరిగిన అభ్యసనాభివృద్ధి నాన్ లాంగ్వేజెస్ వృత్యంతర శిక్షణ ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి కనుక కొత్తకొత్త విషయాలను నిత్యం నేర్చుకోవాలన్నారు. తెర్లాం, బాడంగి మండలాలకు చెందిన 50 మంది ఎస్ఎస్, పీఎస్ సబ్జెక్ట్ టీచర్లు శిక్షణలో పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్లుగా ఐవీ ప్రసాద్, డి.రమేష్ వ్యవహరించారు.



శిక్షణ ముగింపులో మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్

ఆలయ నిర్మాణం ప్రారంభం

రాజాం: మండలంలోని మెంతిపేట గ్రామం వద్ద మృత్యుంజయ ఆలయ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రూ.50 లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి



కందిశలో సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

రేగిడి: మత్తుపదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యం కాపాడుకోవాలని ఎస్ఈబీ ఎస్ఐ ఎం.శ్రీనివాసరెడ్డి యువతకు సూచించారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా మండలంలోని కందిశ గ్రామంలో సారా నిషేధంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సారా, మద్యం, పొగాకు తాగడం వల్ల కలిగే అనర్థాలతో పాటు ఖైనీ, గుట్కా, గంజాయి తీసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కెల్ల మన్మథరావు, రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు వంజరాపు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో ఈ నెల 26వ తేదీన రాజాం రచయితల వేదిక(రారవే) 106వ సమావేశం నిర్వహించనున్నామని రారవే నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం వెల్లడించారు. పొదిలాపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'మల్లిపురం జగదీష్ కథలు–గిరిజన జీవనం' అనే అంశంపై సాహితీవేత్త అల్తి మోహనరావు ప్రసంగించనున్నారన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో విద్యాబోధన

సీతానగరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన, మారుతున్న సరళీకృత విద్యను బోధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ–2 ఎంవీ రమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నిడగల్లు ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల బోధన తరగతులు, నోట్‌బుక్స్‌ను పర్యవేక్షణ టీం సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతిగదుల్లో ఉపాధ్యాయులు చేస్తున్న విద్యాబోధన విద్యార్థులకు అర్థమయ్యేలా ఉండాలని సూచించారు. విద్యాబోధనకు ప్రభుత్వం సమకూర్చిన వనరుల వినియోగంపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతన విద్యావిధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.శివున్నాయుడు, పర్యవేక్షణ టీం సభ్యులు పాల్గొన్నారు.

వర్క్ పుస్తకాల్లో ప్రతి పదం దిద్దాలి

బలిజిపేట: పాఠశాల విద్యార్థుల వర్క్‌పుస్తకాలలో ప్రతి పదాన్ని సరిదిద్దాలని ఎంఈఓ–2 కె.శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు రెండు మానిటరింగ్ బృందాలు మండలంలోని పాఠశాలలను శుక్రవారం పర్యవేక్షించాయి. ఈ సందర్భంగా వంతరాం కేజీబీవీలో ఎంఈఓ–2 కె.శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు సూచనలు చేస్తూ విద్యార్థుల నోట్‌పుస్తకాలు, వర్క్‌బుక్‌లు అప్రమత్తంగా దిద్దాలని సూచించారు. తప్పులను సరిచేసి వారికి చెప్పాలన్నారు. చదువు కంటే రాతలో ఎటువంటి పొరపాట్లు రాకుండా జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలన్నారు. పాఠశాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ఉపాధ్యాయులు లెసన్‌ప్లాన్‌లు, డైరీలు తప్పనిసరిగా రాయాలని స్పష్టం చేశారు. పర్యవేక్షణ రిపోర్టులను జిల్లా అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. ఎంఈఓ–1సామల సింహాచలం బృందం అరసాడ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించింది. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓలతో పాటు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జయప్రసాద్, గౌరీశంకర్, రామారావు, భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం: విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ–2 ఎంవీ రమణ, హెచ్‌ఎం శివున్నాయుడు



బలిజిపేట: కస్తూర్బా పాఠశాలలో సూచనలు ఇస్తున్న ఎంఈఓ–2 కె.శ్రీనివాసరావు

పశువుల ఆరోగ్య పరిక్షణకు ప్రాధాన్యం

సీతానగరం: పశువుల ఆరోగ్యం పట్ల వైద్యశాఖ అధికార సిబ్బంది, ఆర్బీకే పశువైద్య సహాయకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ డివిజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నీలయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీతానగరంలో పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీన కుమార్ ఆధ్వర్యంలో పశువైద్యశాఖ అధికార సిబ్బందికి పశుసంక్షేమం నిమిత్తం తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బలిజిపేట, సీతానగరం మండలాల్లో పశుహెల్త్ కార్డుల పంపిణీ పూర్తయిందన్నారు. పంపిణీ చేసిన హెల్త్ కార్డులను రైతుభరోసా కేంద్రాల పరిధిలో ఉన్నవాటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని కోరారు. క్రమం తప్పకుండా అన్ని పశువులకు హెల్త్ కార్డులు రైతులకు జారీ చేస్తామని తెలిపారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. దూడల్లో పేరుకుపోతున్న నట్టలను నివారించడానికి ముదు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అప్రమత్తం చేశారు. కార్యక్రమంలో బలిజిపేట, సీతానగరం మండలాల పశువైద్యాధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ నీలయ్య

రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలి

పార్వతీపురం టౌన్: విద్యార్థులు, యువత రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యుడు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ పిలుపునిచ్చారు. ఈమేరకు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి డి.చంద్రమౌళి అధ్యక్షతన శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత భారత రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాజ్యాంగనిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ ఫలాలు పేదలకు అందే విధంగా యువత ఆలోచించాలని, సామాజిక బాధ్యతతో మెలగాలని కోరారు. వేదిక జిల్లా అధ్యక్షుడు డీఈఈ ఎం.రత్న కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతతో చదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.రంజిత్ కుమార్, ప్రిన్సిపాల్ అనంతరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ

'నీలం'రంగును విరివిగా ఉపయోగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ జగన్ మోహన్‌రావు

- డీఐఓ జగన్‌మోహన్ రావు

పార్వతీపురం టౌన్: కార్యాలయాలు, ఆస్పత్రులు, చికిత్స కేంద్రాలు, ల్యాబొరేటరీలు, కళాశాలల్లో నీలం (బ్లూ) రంగును విరివిగా ఉపయోగించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జగన్‌మోహన్ రావు సూచించారు. ఏఎంఆర్ వారోత్సవంలో భాగంగా శుక్రవారం గో బ్లూ నినాదంతో పార్వతీపురం పట్టణంలోని 13వ వార్డులో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సదస్సులో ఆయన ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. నీలం కాంతి నిచ్చే వెలుగు ద్వారా గానీ రంగు ద్వారా గానీ నీలం రంగును ఉపయోగించడం వల్ల యాంటీ మైక్రో బయోలాజికల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)ను అరికట్టవచ్చన్నారు. అదేవిధంగా యాంటీ బయోటిక్స్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, యాంటీ పారాజైట్స్‌ను సూక్ష్మ క్రిములను నశింపజేసేందుకు ఆయా రోగాలు సంభవించే సందర్భాల్లో ఉపయోగిస్తారని, వీటిని ఇష్టానుసారం సరైన మెడికల్ ప్రిస్క్రిప్షన్ లేకుండా వినియోగించడం వల్ల యాంటీ మైక్రో బయోలాజికల్ రెసిస్టెన్స్‌కు దారితీస్తుందన్నారు. కొన్ని సంవత్సరాలుగా అన్ని సేవల్లో రెసిస్టెన్స్ పెరుగుతూ ఉండడం వల్ల దాన్ని అరికట్టడం నీలం రంగును ఉపయోగించడం వల్ల కొంతవరకు సాధ్యమవుతుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని తద్వారా చాలావరకు ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. అనంతరం యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను కలసి కట్టుగా నివారిద్దాం' అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.వరప్రసాదరావు, డిప్యూటీ డెమోలు సన్యాసిరావు, యోగీశ్వరరెడ్డి, ఆఫీసు సిబ్బంది ఉషారాణి, ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ బి.పుష్ప, వైద్య సిబ్బంది,పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'ల అభివృద్ధికి పెద్దపీట

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కోసం మంజూరైన నిధులు, కేంద్రాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీల ఏర్పాటుపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శుక్రవారం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 27 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించనుందని తెలిపారు. ఇందుకోసం నాడు–నేడు పథకం ఫేజ్ 2 బీ కింద రూ.38.76 లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో ఆయా కేంద్రాలలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, పెయింటింగ్ వంటి మౌలిక వసతులతో పాటు మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉందన్నారు. రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రం–2, మిర్తివలస అంగన్‌వాడీ కేంద్రాలను రూ.8.50 లక్షలతో అభివృద్ధి చేయాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, కమిటీల ఆధ్వర్యంలోనే ఆధునీకరణ పనులు చేపట్టాలని తెలిపారు. ఐసీడీఎస్ సైపర్‌వైజర్లు కె. రత్నకుమారి, పి.కృష్ణకుమారి, టీఎస్ కుమారి పాల్గొన్నారు.



ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

పక్కాగా రికార్డుల నిర్వహణ

వంగర: గ్రామైక్య సంఘాల రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, రికార్డుల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని రాజాం వెలుగు కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు మండలంలోని ఉన్న 30 గ్రామైక్య సంఘాల రికార్డుల నిర్వహణపై జరిగిన అంతర్గత ఆడిట్‌పై స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామైక్య సంఘాల ద్వారా మహిళలకు రుణాలు మంజూరు, చెల్లింపులు, లావాదేవీలు సకాలంలో చేయాలని సూచించారు. సంఘ సభ్యులు చెల్లించిన అప్పులు వారి ఖాతాలకు మళ్లించాలని, ఇతర ఖాతాలకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీవోఏలు పుస్తక నిర్వహణ, డీసీబీ డిమాండ్ మేరకు చెల్లింపులు, బకాయిలు సకాలంలో చెల్లింపులు, లోన్‌లెడ్జర్ సక్రమంగా నిర్వహించాలని, నగదు పుస్తకాల్లో వ్యత్యాసం లేకుండా సరిచూసుకోవాలన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 22వ తేదీ వరకు నాలుగు వారాల పాటు లింగ వివక్షతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంలు మీసాల చక్రపాణి, టి.మంగమ్మ, సీసీలు తదితరులు పాల్గొన్నారు.